4
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
గురువారం 16 జనవరి 2025
www.ntnews.com

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నెం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఇండియా కూటమి ఖేల్ ఖతం

**గత** లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీ అప్రతిహత ప్రస్థానాన్ని నిలువరించే ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ నాయకత్వంలో ఏర్పడిన కలగూర గంపలాంటి ఇండియా కూటమి ఆశలుడిగిపోయి అవసాన దశకు చేరుకున్నది. కూటమి మిత్ర పక్షాలు కాంగ్రెస్‌ను మోయరాని భారంగా భావిస్తుండటమే అందుకు కారణమని చెప్పాలి. ముఖ్యంగా హర్యానా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరాశాజనకంగా ఉండటంతో విభేదాలు తీవ్రమయ్యాయి. లోక్‌సభ ఎన్నికలు మరో నాలుగేండ్ల తర్వాత కానీ జరగవు. అంతవరకు కాంగ్రెస్‌తో 'సహజీవన భారాన్ని' మోసే ఓపిక మిత్ర పక్షాలకు నశిస్తున్నది. దాంతో క్రమక్రమంగా ఒక్కరొక్కరు కాంగ్రెస్ నుంచి దూరమవుతున్నారు. ముందుగా ఆప్ ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండానే పోటీ చేస్తామని తేల్చి చెప్పింది. ఇండియా కూటమి మిత్రపక్షాలైన టీఎంసీ, ఎస్పీ ఆప్‌కు మద్దతు తెలిపాయి. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్‌పై అనూహ్య రీతిలో చేసిన విమర్శలే ఈ చీలికకు దారితీశాయి. ఫలితంగా కాంగ్రెస్ ఒంటరైంది.

ఇక మహారాష్ట్రలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇండియా కూటమి లేదా స్థానిక రూపమైన మహారాష్ట్ర వికాస్ ఆఘాడీ (ఎంవీఏ) ఉమ్మడి పోటీ అనేది జరగబోదని తేటతెల్లమైంది. బృహన్ముంబై మునిసిపల్ కార్పొరేషన్ సహా పట్టణ సంస్థలకు, జిల్లా పరిషత్‌లకు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తామని శివసేన (ఉద్ధవ్) ప్రకటించింది. కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేయడం ఇండియా కూటమికి పెద్ద దెబ్బ. మిత్ర పక్షాల మద్దతుతో అంతోఇంతో లబ్ధి పొందుదామనుకుంటున్న కాంగ్రెస్‌కు మరీ పెద్ద దెబ్బ. అతిపురాతన పార్టీ ఏకాకితనం స్వయంకృతమేనని చెప్పక తప్పదు. తనకు లేని బలాన్ని ఊహించుకుని అధిక సీట్లు రాబట్టుకోవడం, గెలవలేక చతికిల బడటం వంటివి ఇందుకు దారితీశాయి. రాహుల్ పరిపక్వ శైలి దీనికి ఆజ్యం పోసింది.

ఈ పరిస్థితుల్లో ఇండియా కూటమి జాతీయ ఎన్నికలకు మాత్రమే పరిమితమని మహారాష్ట్ర రాజకీయ కురువృద్ధుడైన శరద్ పవార్ ప్రకటించడం కీలక పరిణామం. ఆచరణాత్మకంగా చూస్తే ఇండియా కూటమి కథ ముగింపునకు వచ్చినట్టేనని అవి సూచిస్తున్నాయి. పరస్పర విరుద్ధమైన భావజాలాలున్న పార్టీలు కేవలం బీజేపీ వ్యతిరేకత అనే ఏకసూత్ర కార్యక్రమం మీదే కూటమిగా ఏర్పడి లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ చేసినా ఫలితం దక్కలేదు. అవసరమైన సందర్భాల్లో రాజీ పడటం, అన్ని పార్టీలను ఏకతాటిపై నడపడం వంటి కూటమి ధర్మాలను పాటించడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందనేది విస్పష్టం. పైగా ఆ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణల్లో హామీల అమలు అనేది హాస్యాస్పదంగా తయారై తీవ్రమైన ప్రజాగ్రహానికి గురవుతున్నది. హామీల డొల్లతనం మీదే బీజేపీ తన అస్త్రాలను సంధించడం మహారాష్ట్రలో కూటమికి ప్రతికూలంగా పనిచేయడం తెలిసిందే. ఇవన్నీ వెరసి కూటమిని లోపల నుంచి కూల్చివేస్తున్నాయి. ఎవరికి వారే కావడంతో కూటమి కథ దాదాపుగా ముగిసిపోయింది.

# ఇప్పటికీ మీరే మా నమ్మకం

**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అన్న విషయం చాలామందికి తెలియదని ఇటీవలి ఉదంతాలు చెప్తున్నాయి. స్వతహాగానే ఇది రేవంత్‌రెడ్డికి కోపం తెప్పించింది. అదే సమయంలో బీఆర్‌ఎస్ అధికారం కోల్పోయి ఏడాది దాటినా కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రతిక్షణం కేసీఆర్, కేటీఆర్‌ను గుర్తుచేస్తున్నాయి. కేరళలో గత నవంబర్‌లో జరిగిన 'టీఐఈ కేరళ 2024'కు హాజరైన కేటీఆర్‌ను మంత్రిగా పేర్కొంటూ వేదికపై ఆహ్వానించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తానిప్పుడు మంత్రిని కాదని కేటీఆర్ చెప్పినా.. తమకు అలాగే గుర్తున్నారని వారు చెప్పడం గమనార్హం. ఈ రెండు ఘటనలను బట్టి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాల్సింది చాలానే ఉందన్నది నిపుణుల మాట.**



డా. అయాచితం శ్రీధర్
98498 93238



'స్టిల్ వియ్ బిలీవ్ ఇన్ యూ సర్'.. ఈ మాట నేను అంటున్నది కాదు. ఇటీవల కేరళ లోని కొచ్చిలో టీఐఈ (ది ఇండస్ ఆంత్రప్రెన్యూర్స్) అనే అంతర్జాతీయస్థాయి సంస్థ ఏర్పాటుచేసిన ప్రముఖుల సమావేశంలో వ్యాఖ్యాత కేటీఆర్‌ను వేదిక పైకి ఆహ్వానిస్తూ తెలంగాణ ఐటీ పరిశ్రమలశాఖ మంత్రిగా సంబోధించారు. 'ఇప్పుడు కాదు' అని కేటీఆర్ సవరించిన సందర్భంలో వ్యాఖ్యాత మరో మాట అన్నారు. 'ఇంకా మేము మిమ్మల్ని మంత్రి గానే భావిస్తున్నాం. విశ్వసిస్తున్నాం' అని ఆ మాటలకు అర్థం. పారిశ్రామిక ఐటీ రంగ నిపుణులపై జాతీయ అంతర్జాతీయ స్థాయిలో కేటీఆర్ ప్రభావం ఎంత ఉందో తెలుసుకోవడానికి ఆ వ్యాఖ్యాత మాటలే తార్కాణం.

స్వరాష్ట్రంలో కేసీఆర్ సారథ్యంలో ఐటీ పురపాలక పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ సాధించిన అభివృద్ధిని చూసిన వారు ఎవరైనా నిజాయతీగా ఆ మాట అని తీరాల్సిందే. కేటీఆర్ మంత్రి పదవి పోయి, కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా ఇంకా కేటీఆర్‌ను మంత్రిగా సంబోధించడం, ముఖ్యమంత్రి పేరును మర్చిపోవడం వంటి సంఘటనలు కాకతాళీయమే అయినప్పటికీ ప్రజలపై వారి ముద్ర ఏ స్థాయిలో ఉందన్నది మాత్రం వెల్లడవుతున్నది.

హైదరాబాద్ పేరు ప్రతిష్ఠలు ప్రపంచం నలుదిశలా వ్యాపించేలా కేటీఆర్ చేపట్టిన కార్యక్రమమే 'ఫార్ములా ఈ' రేస్. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మహానగరాలు పోటీ పడినప్పటికీ ఈ రేసును హైదరాబాద్‌కు రప్పించడంలో కేటీఆర్ వ్యవహార దక్షత ప్రదర్శించి విజయం సాధించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం 'ఫార్ములా ఈ' రేస్ వల్ల హైదరాబాద్ ప్రతిష్ఠ పెరిగిందని పేర్కొనడం గమనార్హం. 'ఫార్ములా ఈ' రేస్ వివాదం ముదిరి పాకానపడటం రాష్ట్ర భవిష్యత్తుకు క్షేమకరం కాదని మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. 'ఫార్ములా ఈ' రేస్ పరమార్థం గ్రహించి రేవంత్ ప్రభుత్వం దానిని కొనసాగిస్తే బాగుండేది. పైగా సాధించి తెచ్చిన కేటీఆర్ మీద అభియోగాలు మోపింది. అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నది. కేసీఆర్ మీద కోపం ఉంటే ఎన్నికల్లో, రాజకీయాల్లో తేల్చుకోవాలి. కానీ, ప్రజలకు, ప్రాంతానికి మేలు చేసే పథకాలను, కార్యక్రమాలను, ప్రాజెక్టులను ఏ ప్రభుత్వానివైనా కొనసాగించాలి తప్ప నీరు కార్చడం న్యాయం కాదంటున్న ప్రజల వేదన అరణ్య రోదనగా మిగిలిపోతున్నది. వివాదాలు, భయాలు సృష్టిస్తే పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోయి అసలుకే మోసం వస్తుందన్న నిపుణుల హితవచనాలు ప్రభుత్వం చెవికి ఎక్కడం లేదు. ఉద్యమ సమయంలో నాటి సమైక్యవాది లగడపాటి రాజగోపాల్ ఓ సందర్భంలో కరుడుగట్టిన తెలంగాణ ఉద్యమకారులు సైతం కన్నీరు పెట్టుకునే రోజు వస్తుందని శాపనార్థాలు పెట్టారు. రెండు జర్మన్ దేశాలు కలిసినట్టుగా విడిపోయిన తెలుగు రాష్ట్రాలు తిరిగి కలిసే అవకాశం ఉందని కొందరు అంచనాలు వేశారు. కర్నూలుకు చెందిన అప్పటి ఎంపీ హైదరాబాదులో సీమాంధ్రులకు రక్షణ లేదని, తుపాకులు ఇవ్వాలని అడిగాడు. కేంద్రపాలిత ప్రాంతంగా హైదరాబాద్ అంటూ కొత్త రాగం ఎత్తుకున్నారు. మొత్తంగా తెలంగాణను ఒక విఫల రాష్ట్రంగా, వికల రాష్ట్రంగా చూపించడానికి, హైదరాబాద్‌ను తెలంగాణకు కాకుండా చేయడానికి స్వరాష్ట్రం ఏర్పడ్డ తొలినాళ్లలో వ్యతిరేక శక్తులు చేయని ప్రయత్నం అంటూ లేదు. ఓటుకు నోటు ఆ కుతంత్రాల్లో భాగమే. ఇప్పుడు ఆ కుట్రలు వివిధ రూపాల్లో మళ్లీ మొలకెత్తుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయి. కేసీఆర్ పరిపాలన దక్షత, కేటీఆర్ కార్యశీలత వల్ల హైదరాబాదులో స్థిరపడ్డ ఇతర రాష్ట్రాల ప్రజలు, స్థానికులు కేసీఆర్ వైపు వచ్చి చేరారు.

> **పిల్లకోడిని గద్దలు తన్నుకుపోకుండా తల్లికోడి కాపాడుకున్నట్టు ప్రత్యర్థుల కుట్రలను ఎక్కడికక్కడ తిప్పికొడుతూ కేసీఆర్ హైదరాబాద్‌ను కాపాడుకున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 24 సీట్లలో సాధించినవి కేవలం 3 కాగా, 2015 గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏకంగా 150 సీట్లకు గాను 99 సాధించింది. హైదరాబాద్ ప్రజలలో వచ్చిన మార్పుకు అది తొలి సంకేతం. గ్రేటర్ చరిత్రలో ఏ పార్టీ ఈ స్థాయిలో ఏకపక్ష విజయం సాధించలేదు. ప్రజలు అందించిన స్ఫూర్తి, సహకారంతో హైదరాబాద్ అభివృద్ధిని పరుగులు పెట్టించడంలో కేటీఆర్ వందకు వంద మార్కులు కొట్టేశారు.**

2009లో తొలిసారిగా అసెంబ్లీ బరిలో దిగినప్పుడు కేటీఆర్ ఉద్యమకారుడే కానీ రాజకీయాలకు కొత్త. పైగా ఆ ఎన్నికల నాటికి సిరిసిల్ల నియోజకవర్గం టీఆర్‌ఎస్(బీఆర్‌ఎస్)కు వడ్డించిన విస్తరి కాదు. అంతకుముందు అక్కడ గెలిచిన చరిత్రా లేదు. అయినా సిరిసిల్ల బరిలో దిగిన నాటి నుంచి వరుసగా ఐదుసార్లు విజయం సాధిస్తూ వస్తున్నారు. 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రస్థాయి ప్రచార బాధ్యతలు నిర్వహిస్తూ సొంత నియోజకవర్గానికి ఒకటికి రెండుసార్లు వెళ్లినా సిరిసిల్ల ప్రజలు అర్థం చేసుకొని అక్కున చేర్చుకొని ఆదరించారు. తెలంగాణ ఉద్యమంలో అందరితోపాటు కేటీఆర్ కేసులు ఎదుర్కొన్నారు.

కేటీఆర్‌కు ఉద్యమ నేపథ్యం ఉంది. ఉన్నత చదువుల జ్ఞానం ఉంది. మంత్రిగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఐటీ పారిశ్రామిక రంగాల్లో కేటీఆర్ సాధించిన విజయాలతో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, వైఫల్యాలను పోల్చి చూసుకుంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఇక ఆయా రంగాల్లో కేటీఆర్ ప్రసంగాలను ప్రస్తుత ప్రభుత్వ అధినేతల ప్రసంగాలను పక్కపక్కనే ఉంచి సోషల్ మీడియా ఓ ఆటాడుకుంటున్నది. కేటీఆర్ ఎక్కడికక్కడ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి నిలదీసి ప్రశ్నిస్తున్నందుకు సహించలేక ఎటూ పాలు పోక మాంత్రికుల వేషాలు, మాయోపాయాలు, ఆంక్షలు, అభియోగాలకు తెగిస్తున్నారు.

మొన్న ఏసీబీ కార్యాలయం నుంచి తెలంగాణ భవన్‌కు వచ్చిన కేటీఆర్ వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిందని మరో కొత్త కేసు పెట్టారు. ఇక ఫార్ములా కేసు వ్యవహారం న్యాయస్థానం దాకా వెళ్లింది. ఏం జరుగుతుందో కాలం నిర్ణయిస్తుంది. కాగా, కేటీఆర్‌ను ఉద్దేశించి ఆ కేరళలో అన్న మాటలు తెలంగాణలో పదేపదే ప్రతిధ్వనిస్తున్నాయి. 'స్టిల్ వియ్ బిలీవ్ ఇన్ యూ సర్'.

> **కేటీఆర్‌కు ఉద్యమ నేపథ్యం ఉంది. ఉన్నత చదువుల జ్ఞానం ఉంది. మంత్రిగా ప్రపంచస్థాయి గుర్తింపు ఉంది. ఐటీ పారిశ్రామిక రంగాల్లో కేటీఆర్ సాధించిన విజయాలతో ప్రస్తుత ప్రభుత్వ పనితీరును, వైఫల్యాలను పోల్చి చూసుకుంటూ ప్రజలు పెదవి విరుస్తున్నారు.**

# అడివినిడిసి యాడికి వోతం

*చీకటి ప్రయాణం.. ధనుర్మాసపు పొగ మంచు అడివిని కప్పేసింది. చిమ్మ చీకట్లో చిక్కటి నిశ్శబ్దపు తరంగాలను తడుముకుంటూ మా ప్రయాణం సాగిపోతున్నది. ఏవో ఆదిమ జ్ఞాపకాల్లో తనువు తడుస్తుండగా అడవి దారిలో వడివడిగా అడుగులు పడుతున్నాయి. పులి కనిపించలేదు గానీ, చలి పులై తరుముతుండగా నట్టడవిలో కుమ్మేన్‌పెంట వెచ్చని నెగళ్లతో అక్కున చేర్చుకున్నది. మా రాక కోసం పెంటకు పెంటంత కళ్లలో ఆర్తి నింపుకొని ఎదురుచూస్తున్నది.*



తుమ్మలపల్లి రఘురాములు
93463 28291



వెదురు కర్రల దడి మీద గడ్డిగోపురాల తీరు గుడిసెలు మంచు నుంచి కాపు కాస్తున్నాయి. ఓ పాతిక దాకా ఉంటాయేమో. ఒక్కో గుడిసెకు రెండేసి సౌర పలకలు విద్యుత్తును వడకట్టి గుడిసెల్లోకి వంపుతున్నాయి. ఎండ పడితే ఓ లైటు వెలుగుతుంది. మబ్బులు కమ్మితే కరెంటు పోతుంది. చెంచుల కట్టూబొట్టూ మారిపోతున్నయి. మాటామర్మం మనసుకెక్కుతున్నయి. బలవంతపు నాగరికమేదో ఒడుపుగా పెంటల్లోకి చొరబడుతున్నదనే ఆలోచనలను భగ్నం చేస్తూ అంజన్న సుర సుర కాలే తైద అంబలి పట్టుకొచ్చిండు. కాలే కడుపుకు తైదంబలి కమ్మగా అనిపించింది. ఓ పట్టు పడితే పానం నిమ్మలపడ్డది. నులక మంచం ఆల్చుకొని పడుకున్నం. అంజన్నకు అడవిల దొరికిన ఆడబిడ్డను సాకి సవరించి హైదరాబాద్ శ్రీచైతన్య కార్పొరేట్ కాలేజీలో చదివిస్తున్నాడట. ఈ మాట విన్నప్పుడు ఆశ్చర్యం, అబ్బురం అనిపించింది. ఆ అడివి దాటి పట్నం దాకా పోయిన తొలి ఆడబిడ్డ ఈ బాలికే కావచ్చు. ఓ రాత్రి కాడ దిక్కులు పిక్కటిల్లుతున్నట్టు అడవి కోడి కూసింది. ఆ కూతకు నాకు మేల్కతట్టింది. చెంచు అంజన్న నిద్ర లేచిండు. ఆకాశం వంక చూసి గోరు కోళ్లు పొడిచినయి. ఇప్పుడే తెల్లారదు, పండుకో సారు అని అంజన్న సూచన. 'కోడి కూసింది కదనే' అని నేను అడిగితే... ఓ చిరు నవ్వు నవ్వి అదా..! కారుకోడి. అందరి కంటే ముందే లేచి అడవిని నిద్ర లేపుద్ది అని చెప్పారు.

> **ఇగో..! ఈ కారు కోడి జాడలను వెతుక్కుంటనే సహచర మిత్రుడు వర్దెల్లి వెంకటేశ్వర్లు మమ్మల్ని ఈ కీకారణ్యంలోకి తీసుకువచ్చాడు. 12వ శతాబ్దంలో జరిగిన పలనాటి యుద్ధం నేపథ్యంలో చెంచు గిరిజన మానవ జీవిత పార్శ్వాన్ని తడుముతూ తను 'కారుకోడి' నవల రాస్తున్నాడు. ఈ నవలకు కావలసిన కథా వస్తువులు సేకరించడానికి ప్రజాకవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, నేను, మరో జర్నలిస్టు మిత్రుడు ఆస్కాని మారుతీసాగర్ కలిసివచ్చాం. ఆలోచనలతోనే కన్నంటుకుంది.**

'వెదురు తడకలతోని ఎంతందమీ ఇండ్లు, ఆవు పేడతోని అలికిన వాకిల్లు, చెంచుల నవ్వులే చెట్లకు పువ్వులు, రాలె పుప్పొడి వాన అడివి పూల వీణ, ఉరిమె నగరి కెరవ అడవి చెంతకు నడువ, అమ్మలా లాలించి అన్నింటిని మరిపించే పరుసుకున్న, రావి నీడల తావున పట్టిన కునుకులో పుట్టెనే ఈ పదం' అంటూ గొరటి వెంకన్న కమ్మటి పాట పొద్దు పొద్దున్నే చెవులకు ఇంపుగా తాకంగ తెల్లారింది. ఆ రాత్రి గమనించలేదు గానీ, గుడిసె నిట్టారి గుంజకు స్విచ్ బోర్డులో సెల్‌ఫోన్ చార్జర్లకూ ఇంత చోటు దక్కింది. చెంచుల చేతికి విల్లమ్ములతో పాటు సెల్‌ఫోన్ వచ్చింది. ఎటొచ్చీ సిగ్నలే కరువు. ఊరి బయట ఏరు పక్కన అటొకటి, ఇటొకటి పంగల కర్రలు పాతి ఉన్నాయి. అందులో ఒకటి రాతియుగం, మరొకటి లోహయుగం. వాటిపై ఉన్న చిన్న బండపరుపు స్టాండ్ మీద ఫోన్ పెడితే సిగ్నల్ అందుకుంటుంది. ఇగ సంబురమే సంబురం. అంగుళం కదిలినా అంతా తుస్.

మానవ కృత్యం మొదలైంది. తోళ్ల వాగుకు ప్రవాహంతో నిండే బంగారి మడుగు దిక్కు బయల్దేరినం. కొద్ది దూరం నడక సాగితే అసలు సిసలైన అడవి ఆరంభమైంది. కింద పదును తేలిన ఏనె రాళ్లు.. పైన మొన తేలిన కొక్కెలా పరిక కంప.. దారికి రెండువైపులా జిట్టీత పొదలు.. శాగ మట్టలు. మిత్రుడు గోరటి వెంకన్నకు, వర్దెల్లికి పాత తొవ్వే. గోరటి అడవి జంతువును మించిన సంచార జీవి. 64 ఏండ్ల వయసులోనూ అలుపు లేకుండా.. అడుగు తడబడకుండా నడుస్తుండు. గోరటి పాటలతో, పరిశీలనతో తెలవకుండానే అడవి సాగిపోతున్నం. అల్లి మట్టల్లకు కలేవచ్చినం. దీన్నే ఎలుగల బయలు అంటారట. 'ఎలుగులు ఉంటయి. చూసి నడువురి' అంజన్న ఆదేశం. అంజన్నకు అడవి మీద అంతులేని పట్టుంది. ఏ కుర్వన ఏ జంతువు ఉంటదో... ఏ సార్వకు ఏ పాము ఉంటదో... కార్తెను బట్టి పొద్దును చూసి వాటి నడత, నడక పసిగట్టగల సమర్థత ఆయనది. 'సీర్‌పులి తిరిగే సోటు.. మాట్లాడకుంటా నడువురి' హెచ్చరికగా చెప్పిండు అంజన్న. ఆఖరికి బంగారి మడుగు అందింది. నీళ్లు దోసిళ్లకు తీసుకుంటే చల్లటి, తియ్యటి దివ్య జలంగా అనిపించాయి. స్నాన కార్యం ముగిసింది. దూరంగా భీమ లింగన్న వాగు మడుగు నీళ్లలో నానేసిన వెదురు పుల్లల్ని తీసి దులిపి, వాటికి బద్దలను కలిపి ఒడుపుగా బుట్టలు అల్లుతున్నడు. ఏమి చాకచక్యం? పైనుంచి పూతలు లేకుండానే అల్లికలోనే రంగులు పుట్టించడం తనకు తెలుసు. ఎటొచ్చీ అమ్మకమే సమస్య అని ఆయన కోడలు అంజమ్మ చెప్పింది. సంతలో మారుబేరాలోళ్లు అడ్డికి పావుశేరు అడుగుతారని గోసతో చెప్పింది. తేనె సేకరణ, నాటు కోళ్ల పెంపకం కొంత ఆదుకుంటాయి. మేకల మంద కూడా ఉంది. లక్కరంగు మచ్చలున్న మేకలు ప్రత్యేకంగా అగుపించాయి.

చెంచులకు వేటంటే ప్రాణం కదా! మరిప్పుడు దాని సంగతేమైంది? గుడిసె చూరులో చెక్కిన పాత బాణం తీసి నా వెంట వచ్చిన మిత్రుడు సవరించబోతే పుటుక్కున ధనుర్భంగమైంది. 'ఇంకేం యాట సారూ.. పిట్టనో కుందేలునే ఏస్తే ఫారెస్టోళ్లు వచ్చి పట్టుకుంటారు' అని ఈదమ్మ వాపోయింది. ఒకప్పుడు అన్నలు, పోలీసులు పెంటల్లో దాగుడు మూతలు ఆడేవారు. ఇప్పుడా బాధ పోయింది. కానీ, కొత్త బాధ మొదలైంది. దగ్గర్లోని పట్నంలోనో, ఊరిలోనో ఇల్లు కట్టిస్తాం.. అడివి వదిలి రమ్మని అధికారులు పోరు పెడుతున్నారు. అదేదో సామెతకు భిన్నంగా చెంచులను కాడు పొమ్మంటుంది.. ఊరు రమ్మంటుంది. అందుకే చెట్టు మీద పిట్ట, చెట్టు కింద చెంచు రందిల మునుగుతుండ్రు. అంజన్న ముఖంలో దిగులు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. చెట్టూ పుట్టా నమ్ముకొని ఇన్నాళ్లూ బతుకు గడిపిండ్రు. ఎవుసం వైపు పోలేదు. దాంతో ఎక్కడెక్కడివాళ్లో వచ్చి సేతానం చేస్తుంటే చెంచులు కూలీలైపోయిండ్రు.

ఎనకటి ఇప్పసారా యాడ ఇగిరిపోయిందేమో గానీ, నాటుసారా పిశాచి చాన్నాళ్లుగా చెంచు మొగోళ్లను తెలివి మీరకుండా నిద్ర పుచ్చుతున్నది. ఇటీవలి కాలంలో ఐఎంఎఫ్‌ఎల్ ఆ పని చేస్తున్నది. కానీ, అంజన్న మేలుకున్నాడు. మూడేండ్లయింది తాగడం మానేసి. అయితే అందరూ అంజన్నలు కారు. ఇప్పటికీ 'సార్ తాగ్‌తా సార్ తాగ్‌తా' అంటూ మొగోళ్లు సీసెంబడి ఉరుకుతనే ఉన్నరు. ఆడోళ్లను తంతనే ఉన్నరు. తాగినా తాగకపోయినా తంతరు సారూ అని ఆడోళ్ల మీటింగ్‌లో ఓ చిన్నక్క చెప్పింది. చిన్నపిల్లలు కోళ్ల గుంపు లెక్క చానామందే ఉన్నరు. మట్టిలో ఆడుతున్నరు. వాళ్లల్ల ఓ ఐదారేండ్ల పిల్ల బాణం తయారు చేసుకుని నవ్వుకుంట నా మీదకే ఎక్కుపెట్టింది. ఎక్కడో బ్రెజిల్‌లో హెలికాప్టర్ మీదకు బాణం ఎక్కుపెట్టిన అడవి బిడ్డలు యాదికి వచ్చి నేనూ నవ్వుకున్న.

గుడిసెలకు వారగా ఓ కూలిన పొడవాటి గుడిసె ఉన్నది. పైకప్పు సగం పైగా లేచిపోయింది. ఎండి బొక్కలు దేలిన పశువు లెక్క కనపడ్డది. దాని ముందున్న సోలార్ ప్యానెల్స్ పనిచేయడం లేదు. అదీ అంగన్వాడీ పరిస్థితి. 'మరింక పిల్లల చదువెట్ల' అని ఓ తల్లి మనాది. 'జర దీని సంగతి చూడుండి సారూ' అని గోరటి వెంకన్నకు నివేదన. ఇలాంటి వేడుకోళ్లు చాలానే వచ్చినయ్. ఎవుసం జేద్దామంటే పందుల బాధతోని పంట దక్కడం లేదు. ఫెన్సింగ్ వేయించమని ఒకామె, రెండు ఎడ్లు ఇప్పించమని మరొకామె ఇలా పోటా పోటీగా అడిగిండ్రు. వారి రంది వెంకన్న ముఖంలోకి పారింది. 'పోడు పట్టాలు అందరికీ వచ్చినయా' అని అడిగితే ఎక్కువమందికైతే వచ్చినయ్ కానీ, ఇంక కొంతమందికి ఏవో కారణాల వల్ల ఆగినయ్ అన్నరు. అంతా విని తన చాతనైనంత చేస్తానని అనుకుంట లేసిండు.

> **భోజనం తర్వాత రచ్చబండ కాడ గానా బజానా. గోరటి వెంకన్న పాటలు పాతయి, కొత్తయి వాళ్లకు చానా తెలుసు. జీపులు నడిపే పిల్లలైతే ఆ పాటలు బంబం అని మోగిస్తరు. ఎదురుగ వెంకన్న ఉంటే సెల్లల్ల, జీపులల్ల ఇనొచ్చే పాటలెందుకు? మురిపెంగ పాట మీద పాట పాడిచ్చుకున్నరు. అంతల్నే వెంకన్న మీరు పాడరా తల్లీ అని ఆడోళ్ల వైపు తిరిగిండు. ముసి ముసి నవ్వులు నవ్వుకుంట ఎల్లమ్మ పాటందుకున్నది. 'రామా దశరథ రామో' అని, ఆ పాటల ఓ కోడెను ఎవరో పెద్దోళ్లు ఎత్తుకుపోయి ఇనుప సంకెళ్లు వేసి కడుపు నిండా గడ్డి పెట్టకుండా మాడ్చి చంపి సావు చేయడం కథ.**

ఏ పూర్వకాలంలోనో చెంచుల మీద పాలకులు జరిపిన ఘోర దురన్యాయాల మీద కట్టిన పాటలా ఉన్నది. అయితే, నేరుగా కాకుండా మరుగున పెట్టి ఉంటుందంతా.. ఇంకోటి, ఇంకోటి అంటూ వెంకన్న బతిమాలి మరికొన్ని పాటలు పాడించిండు. సాధారణ జానపద గీతాల్లాగనే ఉన్నప్పటికీ అన్నీ కూడా చెంచులకు సంబంధించిన అస్తిత్వ పోరాట గీతాలే. ఇప్పటికీ వారి కష్టాలు తీరలేదు. అమ్మలాంటి అడవి నుంచి వారిని విడదీసేందుకు జరుగుతున్న కుట్రలు వారిని కృంగదీస్తున్నాయి. అడవులోని పులులను కాపాడాలంటున్నరు. కానీ, చెంచులను మాత్రం కాన వదిలి పొమ్మంటున్నరు. కన్న బిడ్డలకు కాయో ఫలమో ఇచ్చి ఆకలి తీర్చే తల్లిని వదిలి వెళ్లేందుకు మనసొప్పడం లేదు వారికి. ఇప్పుడు చెంచుల తలల మీద వేలాడుతున్న సమస్య ఇదే. పాటలు వెంటాడతుంటే మళ్లీ పట్నం బాట పట్టినం.

***ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటలను తానే ఉల్లంఘిస్తున్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటన తర్వాత ఆయన తీవ్రంగా స్పందించారు. మహిళ మృతికి బెనిఫిట్ షోనే కారణమని వాదించిన ఆయన, తాను ముఖ్యమంత్రిగా ఉండగా తెలంగాణలో ఇక బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు ఉండదని అసెంబ్లీలోనే ప్రకటించారు. కానీ, అంతలోనే మాట మార్చారు.. సినీ పెద్దలతో సమావేశం తర్వాత తన ద్వంద్వ వైఖరిని అందరిముందు బయటపెట్టేసుకున్నారు.***

# 'సినిమా'పై ద్వంద్వ వైఖరి



కాసర్ల నాగేందర్‌రెడ్డి
00000



అసెంబ్లీలో సినిమా ఇండస్ట్రీ, నటులపై విరుచుకుపడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను అధికారంలో ఉన్నంత వరకూ బెనిఫిట్ షోలు ఉండవని, టికెట్ల ధరలు పెంచబోమని చెప్పారు. కానీ, రెండు వారాల్లోనే యూటర్న్ తీసుకున్నారు. సినిమా పరిశ్రమను సమానంగా చూడాల్సిన ముఖ్యమంత్రి వ్యక్తిగత ప్రయోజనాలు, కక్ష సాధింపు ధోరణితో వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తున్నది. గత నెలలో అల్లు అర్జున్ అరెస్టు విషయంలో దుందుడుకుగా వ్యవహరించిన ముఖ్యమంత్రి జాతీయస్థాయిలో ఒక నటుడి అరెస్టు మీద స్టేట్మెంట్‌లు ఇవ్వడం రాజకీయ, సినీ వర్గాల్ని ఆశ్చర్యపరిచింది. ఇంకో అడుగు ముందుకేసి అసెంబ్లీలోనూ చర్చకు పెట్టారు. బాధితుల పట్ల సానుభూతి చూపడాన్ని ఎవరూ తప్పు పట్టట్లేదు కానీ, మిగతా వ్యవస్థలు చేయాల్సిన పనిని ముఖ్యమంత్రి తన చేతుల్లోకి తీసుకోవడమే ఇక్కడ అభ్యంతరం.

సినీ నటులు సరిహద్దుల్లో పనిచేయట్లేదని, చట్టానికి ఎవరూ అతీతులు కాదన్న ప్రకటన అర్థరహితం. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలోనే సినీ పరిశ్రమతో విభేదాల్ని కొనితెచ్చుకున్న రేవంత్ ప్రభుత్వం ఆనాటి నుంచి అదే ధోరణితో వ్యవహరిస్తున్నది. తన మంత్రివర్గ సహచరులు సినీ ప్రముఖుల కుటుంబ వ్యవహారాల్లో తలదూర్చడం, హైకోర్టు స్టే ఇచ్చినా ఎన్ కన్వెన్షన్ కూల్చివేతలు లాంటివి ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్య దూరం పెంచాయి. తమ ప్రభుత్వాన్ని సినిమా ఇండస్ట్రీ పట్టించుకోవట్లేదన్న దుగ్ధతోనే అల్లు అర్జున్ అరెస్టు విషయంలో అతిగా స్పందించారన్న అపవాదును రేవంత్‌రెడ్డి మూటకట్టుకున్నారు. సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనకు బెనిఫిట్ షోనే కారణమని నిర్ధారించిన ప్రభుత్వం ఇప్పుడు మాత్రం ఉదయం నాలుగు గంటల షోకు ఎందుకు అనుమతినిచ్చింది? అసెంబ్లీ సాక్షిగా ఆయన చేసిన ప్రకటనలకు విలువ లేకుండా పోయింది.

> **ధరల పెంపునకు అనుమతినిచ్చి తన వ్యాఖ్యలను తానే ఎందుకు ఉల్లంఘించారు? ఇంతకీ సినీ పెద్దలతో సీఎం జరిపిన సమావేశం ద్వారా ప్రభుత్వం ఏం సాధించింది? ఇండస్ట్రీకి ఎలాంటి లాభం కలిగింది? ప్రతి విషయంపైనా ముఖ్యమంత్రి ద్వంద్వ విధానాలు అనుసరిస్తారన్న ప్రతిపక్షాల విమర్శల్ని ఇప్పుడు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది. లోపాయికారీ ఒప్పందాలు చేసుకోవడం, మాట వినని వాళ్లను బెదిరించడం రేవంత్‌రెడ్డికి అలవాటుగా మారింది.**

అదే తరహాలో తెలుగు సినిమా ఇండస్ట్రీని భయపెట్టి లొంగదీసుకున్నారా? తనకు అనుకూలమైన వ్యక్తులకు ఒకలా, వ్యతిరేకులను మరోలా ట్రీట్ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న దిల్‌రాజు చిత్రానికి అయాచిత లబ్ధి కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది. ఇది కచ్చితంగా క్విడ్ ప్రో కో కిందకే వస్తుందని బీఆర్‌ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఇండస్ట్రీ పెద్దలు కలవకముందు చట్టం, న్యాయం, అందరికీ సమానమే అన్న రేవంత్‌రెడ్డి, వాళ్లు కలిశాక పరిస్థితులు ఎందుకు మారాయో ప్రజలకు సమాధానం చెప్పాలి.

(వ్యాసకర్త: అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ ఆస్ట్రేలియా)

## సైన్యం లోకి మళ్లీ గూర్ఖాలు

**నేపాల్ సార్వభౌమత్వాన్ని కొనసాగిస్తూనే ఇండియన్ ఆర్మీలో గూర్ఖాల నియామకాన్ని తిరిగి కొనసాగిస్తాం. ఇందుకోసం నేపాల్ అనుమతి కోరుతూ ప్రతిపాదన పంపాం. వారి నుంచి అనుమతి రాగానే రిక్రూట్‌మెంట్ ప్రారంభిస్తాం.**

**- జనరల్ ఉపేంద్ర ద్వివేదీ, ఇండియన్ ఆర్మీ చీఫ్**

